సాక్షి
కుమురం భీం

సోమవారం ¦ 13 ¦ జనవరి ¦ 2025



ఆగుతూ.. అందాలు వీక్షిస్తూ

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం మూడో బర్డ్‌వాక్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పక్షులను కెమెరాల్లో బంధించారు.

8లో▸



స్వామి వివేకానంద జయంతి

జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
28.4 /16.5

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం మరింత తగ్గుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అర్చకుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: దూపదీప నైవేద్యం(డీడీఎస్) అర్చకుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. పండుగ నేపథ్యంలో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు దేవాదాయ కమిషనర్‌ను కలిసి సమస్య విన్నవించామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతి ఇస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్ క్రీడా మైదానంలో ఆదివారం పోలీసు, జర్నలిస్టులకు మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్‌లు నిర్వహించారు. ఫైనల్‌లో ప్రింట్ మీడియా జట్టుపై పోలీసు టీం విజయం సాధించింది. ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విజేత జట్టుతోపాటు రన్నరప్‌గా నిలిచిన జట్టుకు బహుమతులు అందించారు.

జిజియాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు జిజియాబాయిని ఆదర్శంగా తీసుకోవాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఛత్రపతి శివాజీ తల్లి జిజియాబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శివాజీని వీరుడిగా తీర్చిదిద్దడంలో జిజియాబాయి ఎనలేని త్యాగాలు చేసిందన్నారు. ఆరె సంఘాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాదారాం, జిల్లా కార్యదర్శులు ఓమాజీ, నానాజీ, తిరుపతి, మండల అధ్యక్షుడు సంతోష్, రాజు, నాయకులు శ్యాంరావు, మారుతి, శంకర్, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్‌రూరల్: అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామానుజం అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్, గాంధీనగర్, వినయ్ గార్డెన్ కాలనీల్లో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు సక్రమంగా లేని, నంబర్ ప్లేట్ లేని 70 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహనాలను యజమానులు ధ్రువపత్రాలు చూపించి తీసుకెళ్లాలని సూచించారు. నిషేధిత గుట్కాల అమ్మకం, గుడుంబా తయారీ, గంజాయిని విక్రయించడం, పీడీఎస్ బియ్యం, కలప అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

16న వేలం

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 12న మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా మూడు రోజులు పాటు నిర్వహించే జాతర నిర్వహణ కోసం ఈనెల 16న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పులిహోర, లడ్డూ ప్రసాదం విక్రయంతోపాటు తైబజార్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, కొబ్బరి ముక్కల పోగు చేసే హక్కు కోసం వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.50వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

గల్లీ గల్లీకి గంజాయి..!

జైనూర్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని ఈ నెల 2న పోలీసులు పట్టుకున్నారు. షేక్ ఖయ్యుం ఇంట్లో దాడులు నిర్వహించిన పోలీసులకు సుమారు రూ.40 వేల విలువైన కిలో 400 గ్రాముల గంజాయి దొరికింది. అక్రమంగా గంజాయిని నిల్వ ఉంచిన అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో దొరికిన రూ.2.06 లక్షల విలువైన గంజాయి సైతం జైనూర్ నుంచే సరఫరా అయినట్లు తెలుస్తోంది.

గతేడాది అక్టోబర్ 31న వాంకిడి చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా కంటైనర్‌లో అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు ఎండు గంజాయిని పట్టుకున్నారు. రూ.70.42 లక్షల విలువైన 281.7 కిలోలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



- జిల్లాలో పెరిగిన వినియోగం
- గ్రామీణ ప్రాంతాలు, కళాశాలలకు పాకిన మత్తు
- ఏటా పెరుగుతున్న కేసులు

కౌటాల(సిర్పూర్): మద్యం కనీసం ఓ ఏడాది నుంచి గరిష్టంగా పదేళ్ల పాటు తాగితే బానిసలుగా మారతారని చెబుతారు. అదే గంజాయి విషయంలో కొన్ని రోజుల్లోనే బానిసలవుతారు. విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తుంటారు. పట్టణాల్లో మొదలై క్రమంగా పల్లెలకూ గంజాయి మత్తు విస్తరిస్తోంది. జిల్లాకు సరిహద్దున మహారాష్ట్ర ఉండడం, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), రెబ్బెన ప్రాంతాల్లో రైల్వేస్టేషన్లు ఉండడం, జాతీయ రహదారి ఉండడంతో సులువుగా మత్తు పదార్థాలు రవాణా అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు చాపకింద నీరులా పాకుతోంది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాలతోపాటు రెబ్బెన, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), జైనూర్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం జోరుగా ఉంది. గతేడాది జిల్లాలో 39 కేసులు నమోదు కాగా, రూ.70 లక్షలకు పైగా విలువైన 298 కిలోలు స్వాధీనం చేసుకున్నారు.

యుక్త వయస్సులోనే అలవాటు

యుక్త వయస్సులోనే చాలా మంది గంజాయి వైపు ఆకర్షితులవుతున్నారు. 18 ఏళ్లు నిండకముందే బానిసలవుతున్నారు. మత్తు లేకుంటే బతకలేమనే స్థితికి దిగజారుతున్నారు. కొంత మంది యువతను టార్గెట్ చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాల స్థాయిలో మొదట సిగరెట్‌కు అలవాటు పడుతున్నారు. ఆ తర్వాత స్నేహితుల ద్వారా గంజాయికి మారుతున్నారు. విక్రయదారులు సోషల్ మీడియాను కూడా విస్తృతంగా వినియోగిస్తున్నారు. బానిసలుగా మారిన వారు డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారు. యువకులు రోడ్లపైనే గొడవలకు దిగుతున్నారు.

పెరుగుతున్న సాగు

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అంతర పంటగా గంజాయి గుట్టుగా సాగవుతోంది. కొందరైతే ఇంటి ఆవరణలోనే మొక్కలు పెంచుతున్నారు. అక్రమార్కులు కొంతమంది అమాయక రైతులకు డబ్బు ఆశ చూపి ప్రోత్సహిస్తున్నారు. పోలీసు శాఖ చర్యలు చేపడుతున్నా గుట్టుచప్పుడు కాకుండా దందా కొనసాగుతోంది. పత్తి, ఇతర పంటల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. సరిహద్దు మండలాల్లోని మారుమూల గ్రామాల్లో మొక్కలను ఎండబెట్టిన అనంతరం ప్యాకెట్ల రూపంలో తరలిస్తున్నారు. జైనూర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, జైనూర్, కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లోని సాగు ఎక్కువగా ఉంది.

అరికట్టకపోతే అంతే..

కౌటాల ప్రాంతంలో ఇటీవల యువకులు పట్టపగలే గంజాయి విక్రయిస్తున్న పట్టుబడ్డారు. మండల కేంద్రాల్లోని టీ దుకాణాలు గంజాయి విక్రయ కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహస్య ప్రాంతాల్లో గంజాయి తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు అలవాటు పడుతున్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని పోలీసులు అధికారులు హెచ్చరిస్తున్నా అడ్డుకట్ట పడడం లేదు.

- మత్తుకు అలవాటు పడిన వారు నరాల బలహీనత, మెదడు మొద్దుబారడం, ఇతర వ్యవస్థలు నియంత్రణలో ఉండకపోవడం, శరీరం తేలికపడినట్లు మారి ఆ తర్వాత కొత్తశక్తి వచ్చినట్లు అవుతోంది.
- నాడీవ్యవస్థ, మెదడు, కండరాలు వ్యవస్థలపై ప్రభావం చూపుతుంది. బానిసలుగా మారిన వారు ఎక్కువగా ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. ఎవరితో సరిగా మాట్లాడరు. సమయానికి ఆహారం తీసుకోకపోవడంతో అల్సర్ బారినపడతారు.
- సిగరేట్ల రూపంలో పీల్చేవారి నాలుక రుచిని కోల్పోతుంది. నాసికారంధ్రాలు వాసన పసిగట్టే శక్తిని కోల్పోతాయి. ఊపిరితిత్తుల వ్యవస్థ గోడలు నాశనమై చివరకు మరణానికి దారితీస్తుంది. ఇంట్లో వారు, స్నేహితులు గుర్తించి వైద్యం సాయం అందిస్తే మత్తు నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయి.

జిల్లాలో గంజాయి కేసులు

సంవత్సరం	కేసులు	గంజాయి
2022	22	8.550 కిలోలు, 203 మొక్కలు
2023	32	24.62 కిలోలు, 503 మొక్కలు
2024	39	298.855 కిలోలు, 121 మొక్కలు

నిఘా పెంచాం



గంజాయి వినియోగం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఏడాది జిల్లాలో గంజాయి కట్టడికి నిఘా పెంచాం. గతేడాది 39 కేసులు నమోదు చేశాం. 298.855 కిలోల సరుకు సీజ్ చేశాం. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి నమూనాలను పరీక్షించే కిట్లు అందుబాటులో ఉంచాం. పాఠశాలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. ఎవరైనా గంజాయి విక్రయించినా.. సాగు చేసినా.. తాగినా తమకు సమాచారం అందించాలి.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

కష్టాలు తొలగించే ఆదిదేవతలు

- పోతురాజు, ధర్మరాజుకు ప్రత్యేక మొక్కులు
- గ్రామగ్రామాన పూజలు చేస్తున్న కొలాం గిరిజనులు
- ఈ నెల 15 నుంచి ఇందాపూర్‌లో జాతర నిర్వహణ



దేవతలకు మొక్కుతున్న మహిళలు

కెరమెరి(ఆసిఫాబాద్): అత్యంత వెనుకబడిన జాతుల్లో కొలాం గిరిజనులు ఒకరు. వీరు ఇప్పటికీ ఆచార వ్యవహారాలు పాటిస్తూ తమ దేవతలకు సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తుంటారు. కెరమెరి మండలం ఇందాపూర్ సమీపంలో కొలువైన పోతురాజు, ధర్మరాజు దేవతలకు నిష్టతో షష్టి పూజలు చేస్తారు. ఈ నెల 15 నుంచి జాతర మహోత్సవం ప్రారంభం కానుంది. ఆలయంలో దీపం ఆరిపోకుండా వారం రోజులుగా కాపాడుతున్నారు. రాత్రింబవళ్లు కటోడాలు బస చేసి పూజలు చేస్తున్నారు.

ఊరూరా పూజలు

పోతురాజు, ధర్మరాజు గ్రామానికి వస్తే ప్రజల కష్టాలు తీరుతాయని ప్రజలు నమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్, నార్నూర్, జైనూర్, వాంకిడి మండలాలు, కెరమెరిలోని నాగల్‌గొంది, ధనోరా, కొత్తగూడ, ముర్కిలొంక, ఆగుర్‌వాడ, చిచ్‌పల్లి, ఖైరీట్‌తోపాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలోని భక్తులు కూడా పోతురాజు, ధర్మరాజు దేవతల ప్రతిమలను తీసుకెళ్లి పూజలు నిర్వహిస్తున్నారు. గత నెల 5 నుంచి గ్రామాల సందర్శన ప్రారంభమైంది. సిడాం వంశస్తుల ఈ దేవతలను అన్ని గోత్రాల వారు కొలుస్తున్నారు. ఈ నెల 15 నుంచి ఇందాపూర్‌లోని పోతురాజు ఆలయంలో వారం రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

ఆనవాయితీగా వస్తోంది



గ్రామాల్లో అంతా శుభం జరగాలని పోతురాజు, ధర్మరాజును మొక్కుకుంటాం. భక్తులు తమ గ్రామాలకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కష్టాలు, దుఃఖాలు దూరం చేస్తారని నమ్ముతాం. ఇందాపూర్ సమీపంలోని ఆలయంలో ఉత్సవాలు జరుపుకొంటాం.

– సిడాం రాజు, ఆలయ చైర్మన్

వెంకన్న చెంత.. సమస్యల చింత



వర్షాలకు కొట్టుకుపోయిన ఆలయానికి వెళ్లే దారిలోని తాత్కాలిక వంతెన

- అభివృద్ధికి నోచుకోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం
- సరైన దారి సౌకర్యం లేక భక్తులకు అవస్థలు
- తాత్కాలిక వంతెన పనులతో చేతులు దులుపుకొంటున్న వైనం
- ఆలయ ముఖద్వారం భూమిపూజకు నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన రెబ్బెన మండలం గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏటా ఆలయంలో నిర్వహించే జాతరతోపాటు పండుగ పర్వదినాల్లో భారీగా భక్తులు ఆలయానికి తరలివస్తుంటారు. ఆలయ అభివృద్ధిపై అధికార యంత్రాంగం, పాలకులు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే నెలలో మాఘ శుద్ధపౌర్ణమి సందర్భంగా ఆలయంలో మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా స్వామి వారి జాతర మహోత్సవం జరగనుంది. ఆలయం ముందు ప్రవహిస్తున్న గంగాపూర్ వాగుపై వంతెన కోసం భక్తులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. జాతర సమయంలో తాత్కాలిక వంతెన నిర్మించి చేతులు దులుపుకొంటున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలకే తాత్కాలిక వంతెన కొట్టుకుపోతుంది. భక్తులు వరద నుంచి ఆలయానికి వెళ్లాల్సి వస్తోంది. సోమవారం ఆలయ ముఖద్వారం నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క రా నున్నారు. మంత్రి దృష్టి సారించి సమస్యలు పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు.

దారి కరువై..

ఆలయంలోని స్వామి వారిని జిల్లా భక్తులతోపాటు సమీపంలోని జిల్లాల నుంచి తరలివస్తుంటారు. ప్రముఖులు, అధికారులు సైతం స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఇప్పటికీ సరైన దారి సౌకర్యం భక్తులు వాగులో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రముఖుల వాహనాలు కూడా ఆలయం వరకు వెళ్లడం సాధ్యంకాదు. జాతర సమయంలో వాగులో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. సామగ్రిని మోసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆలయం వెనుక భాగంలో ఉన్న గుట్ట పైనుంచి గతంలో దారి కోసం ఏర్పాట్లు చేసినా వర్షాలకు దెబ్బతింటోంది. ఆలయం ఎదుట వాగులో శాశ్వత వంతెన నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

కలగానే కల్యాణ మండపం

మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులపాటు జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పౌర్ణమికి ముందు వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తారు. ఈ మహోత్సవం నిర్వహించేందుకు ఆలయం వద్ద కల్యాణ మండపం కలగానే మిగిలిపోయింది. గతంలో రూ.25లక్షల నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దాతల సహకారంతో సిమెంట్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగపడుతోంది. ఆలయం ఎదుట వాగులో టెంట్లు కింద స్వామి కల్యాణం నిర్వహిస్తున్నారు. ఆలయానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధికి మాత్రం ఉపయోగపడటం లేదని భక్తులు మండిపడుతున్నారు. అలాగే రెబ్బెన మండల కేంద్రంలోని రైల్వేగేట్ నుంచి గంగాపూర్‌లోని ఆలయం వరకు డబుల్ రోడ్డు పనులు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి. డబుల్ రోడ్డు పూర్తిచేసి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

అభివృద్ధిపై ఆశలు..!

జంగుబాయి అమ్మవారి ఆలయాన్ని మొదటిసారి ఓ రాష్ట్ర మంత్రి సందర్శించనున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధికారిక పర్యటనపై ఆదివాసీలు, భక్తులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమ మొర ఆలకించి సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తున్నారు.

- నేడు జంగుబాయి క్షేత్రానికి రాష్ట్ర మంత్రి సీతక్క
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆలయానికి రాష్ట్రమంత్రి రావడం ఇదే ప్రథమం
- సమస్యలు పరిష్కరించాలని భక్తుల విన్నపం

కెరమెరి(ఆసిఫాబాద్): ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. గిరిజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కెరమెరి మండలం మహరాజ్‌గూడ అడవుల్లోని ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి అమ్మవారి క్షేత్రాన్ని సోమవారం సందర్శించనున్నారు. ఉదయం 11 గంటలకు టొప్లకస, సిద్ధికస, రావుడ్ దేవతలు, పోచమ్మ, మైసమ్మ తల్లులకు మొక్కి జంగుబాయి అమ్మవారిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 12.10 గంటలకు అక్కడే భోజనం చేసి సాయంత్రం 3 గంటలకు బయలుదేరుతారని అధికారులు తెలిపారు.

ఘనమైన చరిత్ర

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో కొలువైన జంగుబాయి అమ్మవారికి ఘనమైన చరిత్ర ఉంది. ఒడిశా నుంచి అమ్మవారు ఇక్కడ బస చేసిందని పురాణాలు చెబుతున్నాయి. ఏళ్లుగా ఆదివాసీలు సంవత్సరంలో రెండు సార్లు ఉత్సవాలు నిర్వహిస్తారు. గతేడాది సైతం మంత్రి పర్యటించాల్సి ఉండగా, చివరి నిమిషంలో వాయిదా పడింది. ఈ నెల 25న ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు సంయుక్తంగా మహాపూజ నిర్వహించనున్నారు. ఈ మహాపూజకు మంత్రి హాజరు కావాల్సి ఉంది. కానీ ముందుగానే వస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో అభివృద్ధిపై స్థానికుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాల అధీనంలో ఉన్న జంగుబాయి క్షేత్రంలో ఏళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆలయ కమిటీ సభ్యులు, ఆదివాసీలు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని పరంధోళి రోడ్డు

ప్రధాన డిమాండ్లు ఇవే..

జంగుబాయి అమ్మవారు కొలువైన అటవీ ప్రాంతంలోని భూములను ఆలయం పేరిట పట్టాలు చేయాలి. ఉమ్రి వంతెన నుంచి పరంధోళి వరకు బీటీరోడ్డు నిర్మించాలి. ఆలయం వద్ద తాగునీటి సమస్య ఉంది. దానికి శాశ్వత పరిష్కారం చూపాలి. అప్పటివరకు ట్యాంకర్లు, పైప్‌లైన్ ద్వారా సరఫరా చేయాలి. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తే భక్తులకు మేలు జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సత్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. మహిళా భక్తులకు స్నానపు గదులు, బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి. అలాగే ఎనిమిది గోత్రాలకు చెందిన వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

ఎన్నో ఆశలు



జంగుబాయి అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి సీతక్కపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. సమస్యలతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయాలి. మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేశాం.

– మరప బాజీరావు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు

చైనా మాంజా వినియోగిస్తే చర్యలు

లింగాపూర్: చైనా మాంజా వినియోగిస్తే చర్యలు తప్పవని అటవీశాఖ బీట్ అధికారులు మహేశ్, అనూష హెచ్చరించారు. మండలంలోని కొత్తపల్లి, పిక్లాతండా, నిమ్మతండా, మోతీపటార్‌తోపాటు పలు గ్రామాల్లో ప్రజలకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైనామాంజాతో గాలిపటాలు ఎగురవేయడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. ప్లాస్టిక్ పదార్థంతో తయారీ చేయడంతో పదునుగా ఉండడం, దారానికి గాజుపొడి పూస్తారని తెలిపారు. వీటి వల్ల మనషులు, అటవీ జంతువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం పర్యావరణ చట్టం -2016 ఉత్తర్వులు ప్రకారం చైనా మాంజాను నిషేధించినట్లు తెలిపారు. రవాణా చేసినా, నిల్వ చేసినా జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడు మృతి


కరుణ్ (ఫైల్)

ముధోల్: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కోలిగల్లీకి చెందిన కరుణ్ (32) తండ్రి రాందాస్ భైంసా సర్కిల్ పరిధిలోని కుంటాల మండల కేంద్రంలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి రాందాస్ ముధోల్‌కు రాగా ఆస్తి విషయంలో తండ్రీకొడుకుల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో తండ్రి కొట్టడంతోనే మృతి చెందినట్లు మృతుని భార్య సుష్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ సందర్శించి తనిఖీ నిర్వహించారు.

చోరీకి యత్నించిన ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: చోరీకి యత్నించిన కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో గల ఎస్‌బీఐకి సంబంధించిన పాత సామగ్రి ఓ షెడ్‌లో భద్రపర్చి ఉంచగా ఆదివారం ఉదయం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆ షెడ్ తాళం పగులగొట్టి సామగ్రి దొంగిలించేందుకు యత్నించారు. కలెక్టరేట్‌లో పనిచేసే సబార్డినేటర్ నర్సిములు గమనించి ట్రెజరీలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు వెళ్లగా నిందితులు పరారయ్యారు. టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరైన సారాల సాయన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చైనా మాంజా విక్రయించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నిషేధిత చైనా మాంజా విక్రయించిన ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని బడ్కమొహల్లాకు చెందిన వడస్కర్ కృష్ణ, అశోక్‌రోడ్‌కు చెందిన కూరగాయల శ్రీనివాస్ అశోక్ రోడ్ ప్రాంతంలో పతంగుల కోసం చైనా మాంజా విక్రయించినట్లు తెలిపారు.

చైనామాంజా స్వాధీనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చింతపండువాడకు చెందిన చూడవరపు రమాకాంత్ ఇంట్లో నిలువ ఉంచిన చైనామాంజా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు రమాకాంత్ ఇంట్లో ఆదివారం తనిఖీ నిర్వహించగా ఆరు చైనామాంజా బాబిన్‌లు లభించాయని వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

కోటపల్లి(చెన్నూర్): కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని నాగంపేట బొప్పారం అటవీ ప్రాంతంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్దనుంచి 10 పందెం కోళ్లు, 7 ఫోన్లతో పాటు రూ.59,780 నగదును స్వాధీనం చేసుకుని నాలుగు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆగుతూ... అందాలు వీక్షిస్తూ


సర్పెంట్ ఈగల్


ఉలీ నెకడ్ స్పార్క్


లేజర్ విస్లింగ్ డక్

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన మూడవ బర్డ్‌వాక్ కార్యక్రమం ఆగుతూ.. సాగుతూ ఉత్సాహంగా సాగింది. జన్నారం ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వరంగల్, హైదరాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల నుంచి 15 మంది హాజరయ్యారు. బైసన్‌కుంటలో ఏర్పాటు చేసిన గుడారాల్లో శనివారం రాత్రి బస చేశారు. క్యాంప్‌ఫైర్‌తో పాటు నేచర్ ఎంజాయ్ చేశారు. ఉదయం బైసన్‌కుంట, నీలుగాయికుంట, మల్యాల వాచ్‌టవర్ ప్రాంతాల్లో పర్యటించి కెమెరాలు, బైనాక్యులర్ ద్వారా పక్షులను కెమెరాల్లో బంధించారు. అడవుల అందాలను వీక్షించారు. సఫారీ ప్రయాణంలో కనిపించిన చుక్కల దుప్పులు, అడవి దున్నలు, నీలుగాయిలను చూసి మురిసిపోయారు. ఈ సందర్భంగా వారిని పలకరించిన 'సాక్షి'తో తమ అనుభవాలు పంచుకున్నారు.

– జన్నారం(ఖానాపూర్)


కుటుంబ సభ్యులతో కలిసి బర్డ్‌వాక్‌లో పాల్గొన్న హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్లు

• కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఉత్సాహంగా సాగిన బర్డ్‌వాక్ • హాజరైన ప్రకృతి ప్రేమికులు

చాలా బాగుంది



మొదటిసారి ఇక్కడికి వచ్చా. అడవులు చాలా బాగున్నాయి. రాత్రి అడవిలో బస చేయడం కొత్త అనుభూతినిచ్చింది. ఉదయాన్నే పక్షులను పరిశీలించాం. చుట్టూ అడవి, మధ్యలో చెరువు, పక్షులు, ప్రకృతి అందం చాలా బాగుంది.

– విజయలక్ష్మి, హైదరాబాద్

పిల్లలతో కలిసివచ్చా



నేచర్ అంటే చాలా ఇష్టం. మన పరిసర ప్రాంతాల్లో ఇంత మంచి ప్రకృతి అందాలు ఉండటం చాలా అదృష్టం. మా పిల్లలతో కలిసి వచ్చా. చాలా ఎంజాయ చేశారు. 30 రకాల పక్షులను పరిశీలించా. ఇప్పటికి మూడు సార్లు బర్డ్‌వాక్‌కు హాజరయ్యా.

– అజయ్, సాఫ్ట్‌వేర్, నిర్మల్

కొత్త అనుభూతి



సంక్రాంతి సెలవులకు కుటుంబ సభ్యులతో కలిసి బర్డ్‌వాక్‌కు వచ్చాం. ఈ ప్రాంతంలో నేచర్ చాలా బాగుంది. ప్రకృతిలో పర్యటన కొత్తగా ఉంది. స్వచ్ఛమైన వాతావరణంలో వన్యప్రాణులు, పక్షులను పరిశీలించడం కొత్త అనుభూతినిచ్చింది.

– రవికుమార్, ఏజీపీ హైకోర్టు, హైదరాబాద్

ఎంజాయ్ చేశాం



నేను మా నాన్నతో కలిసి ఇక్కడికి వచ్చా. నాన్న ఇదివరకు ఇక్కడికి వచ్చినట్లు చెప్పడంతో నేనుకూడా రావాలని వచ్చా. రాత్రి ఫైర్‌క్యాంపు, డేరాలలో ఉండటం కొత్తగా అనిపించింది. రాత్రి పక్షులు, జంతువుల అరుపులు విని భయమేసింది. ఉదయం ఎంజాయ్ చేశాం. – నివేశ్, విద్యార్థి

అడవుల విశిష్టతను తెలిపేందుకే..



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవుల్లో చాలా విశేషాలున్నాయి. ఇక్కడి అడవులకు విశిష్టత ఉంది. వీటిని పక్షి, ప్రకృతి ప్రేమికులకు తెలియజేయడానికి బర్డ్‌వాక్ నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేచర్ లవర్స్ నుంచి స్పందన వస్తోంది. వారికి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– సుష్మారావు, రేంజ్ అధికారి


భీమారంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద

గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద..

భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన బర్డ్‌వాక్‌లో పలువురు పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. గతంలో అటవీశాఖ అధికారులు నిర్వహించగా ఈసారి మాత్రం భీమారం, చెన్నూర్ ప్రాంతాలకు చెందిన పక్షి ప్రేమికులు కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్రాంతి సందర్భంగా తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. బైనాక్యులర్ ద్వారా వివిధ రకాల పక్షులను తిలకించినట్లు తెలిపారు.

ఉద్యోగికి సీఎండీ అభినందన


ప్రదీప్‌రావును అభినందిస్తున్న సీఎండీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనికి చెందిన ఎరవెల్లి ప్రదీప్‌రావును సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అభినందించారు. సింగరేణి సాధిస్తున్న ప్రగతిని వివరిస్తూ ప్రదీప్‌రావు రాసిన ఆర్టికల్ రాష్ట్ర ప్రభుత్వ అధికార మాస పత్రిక 'తెలంగాణ'లో ప్రచురితమైంది. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ అభినందించారు. సంస్థపై యూట్యూబ్ చానల్, ఫేస్‌బుక్‌లో మంచి పోస్టులు పెడుతూ సంస్థ గొప్పతనాన్ని తెలంగాణ వ్యాప్తం చేయడంపై సీఎండీ హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

తాండూర్(బెల్లంపల్లి): గంజాయి కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రేచిని గ్రామానికి చెందిన కొంతమంది శనివారం ఈజ్‌గాంలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి పంచుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించి సునార్కార్ రమణ, మచ్చ రాకేష్, కొడిపే నాగార్జున, చింతపురి శ్రీనివాస్ వద్ద 1,150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ప్రకృతిని విధ్వంసం చేసే ఓసీపీలు వద్దు'


మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

బెల్లంపల్లి: మానవ జీవన విధానాన్ని, ప్రకృతిని విధ్వంసం చేసే ఓసీపీల ప్రతిపాదనలు విరమించుకుని భూగర్భ గనుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లాభాల కోసం సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఓసీపీల వల్ల ప్రకృతి విధ్వంసం జరుగుతోందని, మానవాళితో పాటు జీవరాశుల మనుగడకు ప్రమాదం ఉందన్నారు. బెల్లంపల్లి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు అపారంగా ఉన్నాయని, వీటిని వెలికితీసేందుకు శ్రావణ్‌పల్లి, శాంతిఖని ఓపెన్‌కాస్ట్ గనులను ప్రారంభించాలనే తలంపుతో సింగరేణి యాజమాన్యం పావులు కదుపుతోందన్నారు. గతంలో ప్రతిపాదించిన షాప్ట్‌బ్లాక్ 1,2,3,4 భూగర్భ గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శాంతిఖని గని కేంద్రంగా కొత్తగా ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ గనిని బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొయ్యల ఏమాజీ, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరటి రాజన్న, కార్మిక సంఘాల నాయకులు చాంద్‌పాషా, మణిరాంసింగ్, గోగర్ల శంకర్, రాజు, రామస్వామి, దామెర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధశతాబ్దం తర్వాత అపూర్వ కలయిక


చెన్నూర్: 1975-76లో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

చెన్నూర్: 1975–76 విద్యాసంవత్సరంలో చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు చెన్నూర్‌తో పాటు మంచిర్యాల, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, బెంగళూర్, బెల్లంపల్లి, నిజామాబాద్, తదితర పట్టణాల్లో స్థిరపడ్డారు. వారంతా 50 ఏళ్ల తర్వాత ఆదివారం చెన్నూర్‌లోని ఎస్ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులు పులి రామన్న, అడువాల లచ్చయ్య, బి.చంద్రయ్య, సాధిక్ అలీని ఘనంగా సన్మానించారు.

20 ఏళ్ల తర్వాత మళ్లీ బడిలో..

దండేపల్లి: దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05 లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మురిసిపోయారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు.


దండేపల్లి: నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఝురి దేవతకు ప్రత్యేక పూజలు


ఝురి (కలశం) దేవతకు పూజలు చేస్తున్న వడగామ్ గ్రామస్తులు


విశ్రాంతి తీసుకుంటున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): కేస్లాపూర్ నాగోబా మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం ఈ నెల 10న బయలుదేరిన మెస్రం వంశీయులు ఆదివారం వడగామ్ చేరుకున్నారు. ఝురి(కలశం) దేవత తమ గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మెస్రం వంశీయులు అక్కడి నుంచి పాదయాత్రగా బయలుదేరి ఉట్నూర్ మండలంలోని సాలేవాడకు చేరుకున్నారు. ఈ నెల 13న ధర్మగూడ, 14న కొత్తగూడ, 15న కడెం మండలంలోని ఉడుంపూర్, 16న దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్, 17న మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగుకు వెళ్లి ప్రత్యేక పూజల మధ్య పవిత్ర గంగాజలం సేకరిస్తారు. తిరుగుప్రయాణంలో 18న ఉట్నూర్‌లో, 19న ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్‌లో బస చేస్తారు. 20న ఇంద్రవెల్లి మండలంలోని దొడంద పొలిమేరలో గంగాజలం భద్రపరిచి తమ గ్రామాలకు వెళ్లనున్నారు. ఈ నెల 24న మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మూడు రోజుల పాటు కెస్లాపూర్ పొలిమేరలోని మర్రిచెట్టు వద్ద సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. 28న గంగాజలంతో నాగోబాకు జలాభిషేకం చేసి ఆలయాన్ని శుద్ధిచేస్తారు. అనంతరం మహాపూజ నిర్వహించి నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు మెస్రం వంశీయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్ను పటేల్, మెస్రం లక్ష్మణ్, మెస్రం దేవ్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, దాదారావ్, తిరుపి, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

భీమిని(బెల్లంపల్లి): పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గంగారాం తెలిపిన వివరాల మేరకు కన్నెపల్లి మండలంలోని చింతపూడి గ్రామానికి చెందిన తుమ్మిడి గణేశ్ (24) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు చెప్పిన మాట వినకుండా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాడు పడ్డాడు. ఆదివారం పొలానికి నీళ్లుపెట్టిరమ్మని తల్లిదండ్రులు చెప్పడంతో అక్కడికి వెళ్లిన గణేశ్ మద్యం మత్తులో పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి తుమ్మిడి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖాళీగా తిరగొద్దన్నందుకు చంపేశాడు..

• కొత్తూరుపల్లిలో ఘటన


కౌసల్య (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జన్నారం: ఖాళీగా తిరగవద్దని, ఏదైనా పనిచేసుకోమని చెప్పినందుకు క్షణికావేశంలో చిన్నమ్మను హత్యచేసిన ఘటన మండలంలోని కొత్తూరుపల్లిలో చోటు చేసుకుంది. లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరుపల్లికి చెందిన మడావి కౌసల్య (50), జంగుబాయి అక్కాచెల్లెళ్లు. కౌసల్యకు పెళ్లయిన కొన్నాళ్లకే భర్త గౌరయ్యతో విడాకులయ్యాయి. జంగుబాయికి కృష్ణ, మోహన్‌రావు ఇద్దరు కుమారులు. మోహన్‌రావును కౌసల్య దత్తత తీసుకుంది. కృష్ణ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మానసిక స్థితి కుదుట పడటంతో ఖాళీగా ఉండకుండా ఏదైనా పనిచేసుకుంటే ఏమవుతుందని కౌసల్య పలుమార్లు చెప్పింది. అదే మనస్సులో పెట్టుకున్న కృష్ణ చిన్నమ్మను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం ఉదయం కౌసల్య గ్రామ సమీపంలోని వాగు పక్కన గల తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన కృష్ణ తన వద్ద ఉన్న గొడ్డలితో కౌసల్య మెడపై నరికాడు. మృతి చెందడంతో అక్కడి నుంచి పారిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి కుమారుడు మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు


ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మందమర్రిరూరల్ (రామకృష్ణాపూర్): తెలంగాణ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అండర్–13 ఉమెన్ రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో గజ్వేల్ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు విజయం సాధించింది. రెండోమ్యాచ్ హైదరాబాద్ ఉమెన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఖమ్మం), కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్ల మధ్య జరుగగా 02–02తో డ్రాగా ముగిసింది. మూడోమ్యాచ్ ట్విన్ సిటీస్ (హైదరాబాద్) పీకేఆర్–11(ఆదిలాబాద్) మధ్య జరుగగా ట్విన్ సిటీస్ జట్టుపై పీకేఆర్ 11 జట్టు 0–06తో గెలుపొందింది. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ రాంచందర్, ఏరియా ఆస్పత్రి వైద్యులు జానపాటి శరత్‌బాబు బహుమతులు అందజేశారు.

అడవిలో అద్దం



జన్నారం: అడవిలో ప్రకృతి ప్రసాదాలైన చెట్లు, మొక్కలు, జంతువులు వేటిని చూసినా అందంగా కనిపిస్తాయి. మంచిర్యాల జిల్లా కవ్వాల్ అభయారణ్యంలో వన్యప్రాణుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటికుంటలు అద్దాన్ని తలపిస్తున్నాయి. సమీపంలోని వృక్షాల ప్రతిబింబాలు.. అందంగా కనిపిస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి.


చెరువులో మోడువారిన చెట్ల ప్రతిబింబం